మినీ కథ

# మరో పెళ్లి కథ

కె. వి. ఎల్. నరసింహశాస్త్రి

ఎత్తయిన అరుగుమీదు చుట్టూతా ఉన్న టేబుల్ వెనక కూర్చుని వున్నాడాయన.

పైన పంకా తిరుగుతున్నా మొఖమంతా చెమట! పొలాలూ, స్థలాలూ, వాటి క్రయ విక్రయాలూ, ఆయన సమ్మతి ముద్రతోనే ఖరారు అవుతాయి. అంతేకాదు, పెద్దవాళ్ళ నెదిరించినవాళ్ళు, ఆర్భాటాలూ యిష్టంలేనివాళ్ళు అక్కడే ఒకటౌతారు. ఈయన వాళ్ళ పెళ్ళికి సమ్మతి ముద్ర వేస్తాడు.

ఇప్పుడు ఆయన ఎదురుగా ఓ అమ్మాయి, ఓ అబ్బాయి నిలబడి వున్నారు. వాళ్ళ వెనగ్గా ఓ అరడజనుమంది యువతీ యువకులున్నారు. వాళ్ళ చేతుల్లో దండలున్నాయి.

ఆ అమ్మాయి ముఖంలో ఏదో ఆందోళన! కళ్ళల్లో ఏదో పట్టుదల!

అవును మరి, తను ప్రేమించిన ఆ అబ్బాయిని పెళ్ళి చేసుకుంటానంటే తండ్రి ఏమన్నాడు? వీల్లేదన్నాడు. వర్ణ సంకరం కావటం ఒప్పుకోనన్నాడు. కంఠంలో ప్రాణం ఉండగా జరగదన్నాడు. ఎవర్నో తెస్తానన్నాడు. ఎంతో ఆస్తి అన్నాడు. తనకి ఐశ్వర్యమా కావాల్సింది? కాదు. మనసు నర్పించిన వాడితో పెళ్ళి!....

అసలు తన తండ్రి యెన్నో వర్ణాంతర వివాహాలకు పెద్దగా వ్యవహరించాడు. వాళ్ళు ఏర్పాటు చేసిన విందుల్లో పాల్గొని ఉపన్యాసాలు దంచాడు. ఇలాంటివెన్నో జరిగితే గాని జాతి జాగృతం కాదన్నాడు.

మరి తన కూతురు?

ఉహూఁ.

అందుకే తెగించింది. ఇరవై రెండేళ్ళ తను, కోరినవాడిని పెళ్ళి చేసుకోవటానికి ఏ న్యాయ స్థానమూ అడ్డు చెప్పదు. ఏ రిజిస్ట్రారుకీ రూల్సు అడ్డం రావు.

పైన సర్కారువారి ముద్రగల కాగితాల మీద రొటీన్‌గా యేదో రానేసి, గుమాస్తా ఆయనముందు పెట్టాడు. అదేదో ముఖ్యమైన ప్రభుత్వ తాఖీదులా అక్షరం పొల్లుపోకుండా చదివాడు. మళ్ళీ చదివాడు. మళ్ళీ....

తలెత్తాడాయన.

"ఉభయులకీ యిష్టమేనా....?" అని అడిగాడు.

వాళ్ళు తల ఊపారు.

సంతకాలు యెక్కడ పెట్టాలో గుమాస్తా చూపాడు.

ఎంతో ఆనందంగా సంతకాలు పెట్టారు వాళ్ళు. వెనకాల ఉన్న యువతీ యువకులు సాక్షి సంతకాలు పెట్టారు. ఒకరికొకరు దండలు వేసుకున్నారు.

ఎంతో ప్రేమగా తన ప్రియుడివైపు చూసింది ఆ అమ్మాయి. ఆ చూపులో వారికే తప్ప యెవరికీ అర్థంగాని యెన్నెన్నో మధుర భావాలు! తను గెలిచింది!!

ఏనాడో మనస్సుల్లో ఒక్కటైపోయినవాళ్ళు, ఈనాడు ప్రభుత్వ సహాయంతో, లోకం దృష్టిలో ఒక్కటైపోయారు.

ఆయనకు కృతజ్ఞతలు చెప్పి, ఫ్యాన్‌కి మామూలు ఇచ్చి వాళ్ళంతా వెళ్ళిపోయారు.

ఆయన యెన్నో జంటల్ని కలిపాడు. వాళ్ళల్లో కనిపించే పట్టుదల, ప్రేమ, అనురాగం....అన్నీ చూశాడు.

రుమాలతో చెమట తుడుచుకుంటూ కళ్ళొత్తుకున్నాడు—అవును మరి, కాళ్ళు కడగటాలు, కాశీకి వెళ్ళొద్దనటాలు, విందులు, కట్నాలు....ఇవేవీ లేకుండా కూతురు పెళ్ళి చేశాడాయె!! □



# పెళ్లి

దాసరి సుబ్బారావు

వెంకట్రామయ్యగారు-గొప్పవారని అందరూ అంటారు ఆస్తి విషయికంగా. అందుకే ఆయన యింట్లో అడుగు పెట్టేటపుడు కొంచెం యిబ్బందిగా అనిపిస్తుంది. కాని వాళ్ళ వూరు వెళ్ళినపుడు ఆయనను కలుసుకోలేదంటే ఆయనకు నేను నిర్లక్ష్యం చేశానన్న అభిప్రాయం కలగొచ్చు. ఒకసారి కనిపిస్తే యీ గొడవలన్నీ వుండవుగదాని కలుసుకొంటూనే వుంటాను. వెళ్ళిన దగ్గర్నుంచీ ఏదో ఒక విషయం—స్వంతాన్ని గురించి—మోకాలు కదలలేదనో, అలా కదలక పోవటాన్ని గురించిన ప్రత్యేకత గురించో మాట్లాడటం పట్ల తనకున్న అసహ్యాన్ని గురించో ఎదుటివాడిలోని ప్రత్యేకతల్ని గురించి పట్టించుకోని వాళ్ళను గురించో, అమెరికాలోని తన అబ్బాయి గురించో — మాట్లాడతారు, బహుశ నేను ఒప్పుకొనే లక్షణం ఉన్నవాడిననే ధీమా కొద్దీ కాబోలు. ఇబ్బంది అన్న నా మాటకు యీసరికి అర్థం మీకు బోధపడి వుండవచ్చు. అక్కడకు వెళితే నాకు జరిగే మర్యాదలు రకరకాలైన భావాలు కలిగిస్తాయి. ఎంతో త్యాగంచేస్తేగాని నా యింట్లో నేను ఇంకొకరికి అటువంటి మర్యాదలు జరపలేను. ఖరీదైన ఆ పింగాణీ పళ్లాలేమీ, కప్పులేమీ, చెంచాలేమీ. అటువంటప్పుడే నాకు నేను బీద వాణ్నయినందుకు మనసులో బాధ కలుగు